అన్నదాతకు సర్కారు వాత

రైతులకు మేలు చేస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నాయకులు ఇప్పుడు వారినే ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేకూరిన లబ్ధి కంటే ఎక్కువగా జమ చేసి అన్నదాతలను ఆదుకుంటామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని కష్టాల్లో నెట్టేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

- పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి
- ఈ ఏడాది రబీ నుంచి అమలు


వరి పైరుకు పురుగులమందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

పామర్రు: రైతు భరోసా పథకం కింద ఏటా రూ.20వేలు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఇంత వరకు దానికి అతీ గతీ లేదు. దీంతో రైతులు దిక్కు తోచని స్థితిలో పడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలిచింది. విత్తు దగ్గర నుంచి ఎరువుల వరకు అన్ని వారి ఇంటి ముంగిటకు అందించింది. పంట పెట్టుబడికి వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 సాయం మంజూరు చేసింది. అంతే కాకుండా పంటల బీమా ప్రీమియాన్ని గత ప్రభుత్వమే రైతుల తరఫున ఏటా బీమాగా చెల్లించింది. పంట నష్టం జరిగితే బీమా పరిహారాన్ని కూడా సకాలంలో బాధిత రైతులకు చెల్లించింది. కూటమి ప్రభుత్వం పంట బీమా ప్రీమియాన్ని రబీ నుంచి రైతులే చెల్లించుకోవాలని తెగేసి చెప్పింది. దీంతో 2019కు ముందరి పరిస్థితులే పునరావృతం అవుతాయని రైతులు చర్చించుకుంటున్నారు. దీని వలన వారిపై మరింత భారం పడనుంది. రైతు భరోసా ఇవ్వక పోవడంతో ఖరీఫ్ సీజన్‌లో అప్పులు చేసి రైతులు పెట్టుబడులు పెట్టారు. పంటల బీమా ప్రీమియం చెల్లించడం వలన ఇంకా అప్పులు పాలు కావాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

బీమా ప్రీమియం చెల్లించిన వైఎస్సార్ సీపీ

దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచిత పంటల బీమా పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసింది. పంటల బీమాకు సంబంధించిన రైతులు చెల్లించాల్సిన పూర్తి ప్రీమియాన్ని ఏటా రూ.13 కోట్లు ప్రభుత్వమే చెల్లించింది. పంటల బీమాకు సంబంధించి వరి పంటకు ఎకరానికి రూ.42 వేల బీమా వర్తించేది. ఎకరానికి రూ.630 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మినుము పంటకు ఎకరాకు రూ.20వేలు బీమా వర్తించగా రైతు రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే పెసర పంటకు ఎకరాకు రూ.20వేలు వర్తించగా రైతు రూ.300 ప్రీమియం చెల్లించాలి. మొక్కజొన్న ఎకరాకు రూ.36 వేలు బీమా వర్తిస్తుంది. దీనికి రూ.540 చెల్లించాలి.

రైతులపై భారం



గత ఐదేళ్లలో పంటల బీమా వైఎస్సార్ ప్రభుత్వం చెల్లించింది. ఎన్నో లక్షల మంది రైతులకు ప్రయోజనం కలిగింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలు పేరుతో కూటమి ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమాను ఎత్తి వేసి అన్నదాతపై భారం వేయటం దుర్మార్గం. దీంతో వరి రైతులు ఎకరాకు రూ.630 చెల్లించాల్సి ఉంటుంది.

– మన్నెడ్డి అంజిరెడ్డి, రైతు, పామర్రు

బీమా కింద రూ.33.08 కోట్ల చెల్లింపు

జిల్లాలో 2019 నుంచి 2022–23 వరకు జరిగిన పంట నష్టానికి సంబంధించి రైతులకు రూ.33.08 కోట్లు పంటల బీమా కింద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లించింది. వరి, మినుము, పెసర, మొక్కజొన్న, ఉద్యాన పంటలకు వైఎస్సార్ పంటల బీమాను అమలు చేసింది. పంటల బీమా పథకానికి సంబంధించి ప్రీమియాన్ని రబీ సీజన్ నుంచి రైతులే చెల్లించుకోవాలి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.

– పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి

ఆయిల్ పామ్ సాగుకు లంక భూములు అనుకూలం

పామర్రు(తోట్లవల్లూరు): ఆయిల్ పామ్ సాగుకు లంక భూములు అనుకూలంగా ఉంటాయని ఉద్యాన శాఖ అధికారి చందు జోసఫ్ సుందరం పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలంలోని భద్రిరాజుపాలెం, చాంగంటి పాడు గ్రామాల్లో ఆయిల్ పామ్ సాగుపై ఉద్యానశాఖ, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు సోమవారం అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరం మాట్లాడుతూ ప్రస్తుతం నూనెల ఉత్పత్తి తగ్గుతున్న నేపథ్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపుదల చేయాలనే ఉద్దేశంతో ఈ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు మన వాతావరణానికి అనుకకూలమైనదన్నారు. నీరు నిలువని నల్ల రేగడి భూముల్లో సాగు చేసుకోవచ్చన్నారు. మొక్కలకు అయ్యే ఖర్చులో 100 శాతం రాయితీని ఉద్యానశాఖ రైతులకు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు మురళీ, అనిత పాల్గొన్నారు.

ఉపాధి సభలు ప్రారంభం

గుడ్లవల్లేరు: ఉపాధి హామీ పథకం కింద గుడ్లవల్లేరు మండలంలోని గ్రామాల్లో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఉపాధి పనులపై సభలను సోమవారం ప్రారంభించారు. ఉపాధి ఏపీఓ పి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో చిత్రం, పెంజెంద్ర, పోలిమెట్ల, కూరాడ, కూచికాయలపూడిలో సభలను నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఎన్నుకున్న పనులపై ప్రజలతో రాంప్రసాద్ చర్చించారు.

క్లుప్తంగా

విద్యలో రాణించాలి



ముదినేపల్లి రూరల్: విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సూచించారు. మండలంలో గతేడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550కు పైగా మార్కులు సాధించిన 11మంది విద్యార్థులకు ఎన్ఆర్ఐలు గట్టమనేని బాబు, రామకృష్ణ ఆర్థిక సాయంతో ల్యాప్‌ట్యాప్‌లు, ఒక్కొక్కరికి రూ.5 వేలు వంతున ఆర్థిక సాయాన్ని ముదినేపల్లి, వడాలి జెడ్పీహైస్కూళ్లలో సోమవారం అందజేశారు.

స్కిప్పింగ్ పోటీలకు 11 మంది ఎంపిక



పామర్రు: రాష్ట్ర స్థాయి స్కిప్పింగ్ పోటీలకు తమ హైస్కూల్ విద్యార్థులు 11 మంది ఎంపికయ్యారని జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం రాజేశ్వరి తెలిపారు. స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్లో విజేతలైన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల రెండో తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్కిప్పింగ్ పోటీలను పామర్రులో నిర్వహించారని తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో తమ హైస్కూల్‌కు చెందిన 11 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. విజేతలను, వీరికి శిక్షణ ఇచ్చిన పీడీలు జీ మురళీ, రవి కిషోర్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్ఏ-2 పరీక్షలు ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): ఈ నెల 8వ తేదీ వరకు జరిగే సెల్ఫ్ ఎసెస్మెంట్–2 పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు సంస్కృతం ప్రధానంగా గల కూచిపూడి, పెద ముత్తేవి పాఠశాల్లో జరిగిన పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి–2 కే శ్రీలక్ష్మి తనిఖీ చేశారు. కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర ఓరియంటల్ జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం గుంటూరు వెంకట సత్య ప్రసాద్ పర్యవేక్షణలో 177 మంది, పెద ముత్తేవి శ్రీ లక్ష్మీపతి స్వామి విద్యా విహార్ సంస్కృతోన్నత విద్యాలయంలో హెచ్ఎం మాధవి పర్యవేక్షణలో 90 మంది ఈ పరీక్షలకు హాజరయ్యారు. బుధవారం నుంచి మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎస్ఏ–2 పరీక్షలు ప్రారంభంకానున్నాయి.

7న చేపల పెంపకానికి వేలం పాట

జమిదింటకుర్రు(పెదపారుపూడి): మండలంలోని జమిదింటకుర్రులో రెండు పంచాయతీ చెరువుల్లో చేపల పెంపకానికి ఈ నెల 7వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ పుణుకొల్లు శివరామప్రసాద్ సోమవారం తెలిపారు. పంచాయతీకి ఆనుకుని ఉన్న సుమారు 14 ఎకరాల చెరువుకు మరో ఎకరన్నర చెరువుల్లో చేపల పెంపకానికి పంచాయతీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల పెంపకం పాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

వడ్లమన్నాడు లేఅవుట్ పరిశీలన



గుడ్లవల్లేరు: వడ్లమన్నాడు లేఅవుట్‌ను హౌసింగ్ ఈఈ గుమ్మడి రత్నశ్రీ సోమవారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. 2025 మార్చి వరకు మాత్రమే పీఎంఏవై 1.0 లబ్ధిదారులకు కేంద్రం నుంచి తమకు మంజూరైన ఒక్కో పక్కా గృహానికి రూ.1.80 లక్షలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పీఎంఏవై 2.0 పథకాన్ని 2025 ఏప్రిల్ నుంచి ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రతి గ్రామంలో సొంత స్థలం కలిగి ఉన్న అర్హులైన లబ్ధిదారులను ఆయా ప్రాంతాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ గుర్తించాలని ఆదేశించారు. హౌసింగ్ డీఈ ఎం.రామోజీ నాయక్, ఏఈ ఎ.సురేంద్ర ఉన్నారు.

అందరితో ప్రేమగా మెలగాలి

గుడ్లవల్లేరు: అందరితో ప్రేమగా మెలగాలని జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు, మొవ్వ ప్రాంతానికి చెందిన యేసే జవాబు మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ వి.పరిశుద్ధ రాజు అన్నారు. సోమవారం సింగలూరులో ఆయన చర్చి నూతన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ కాపరి బి.జాన్, దొంతు మురళీప్రసాద్, విశ్వాసులు బద్వేలు సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు


కూచిపూడి ఆలయంలో స్వామికి అభిషేకం


గుడివాడలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కైకలూరు శ్యామలాంబ ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గుడ్లవల్లేరు: తొలి కార్తిక సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు స్వామి వార్లను దర్శించుకునేందుకు ఆలయాల్లో బారులు తీరారు. గుడ్లవల్లేరు సిద్ధేశ్వరాలయం, నగరేశ్వరాలయం, విన్నకోట భోగేశ్వరాలయం, కొతవరం గౌతమేశ్వరాలయాల్లో స్వామివార్లకు వేద మంత్రోచ్చరణ నడుమ అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను వేద పండితులు నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: కార్తికమాసం తొలి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సింగరాయపాలెం శ్రీఅమృతేశ్వరస్వామి, గురజ, వడాలి, పెదకామనపూడి, చినకామనపూడి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. ఆలయ నిర్వాహకులు భక్తుల రద్దీ దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేశారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్తలమండలి పర్యవేక్షణలో విశ్రాంతి ఉపాధ్యాయుడు చింతలపాటి రామకృష్ణ బ్రహ్మత్వంలో మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు జరిగాయి. అర్చకులు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ, సతీష్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో అభిషేకాలు నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: కార్తికమాసం తొలి సోమవారం కావడంతో మండలంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక దీపాలు వెలిగించి స్వామి వారికి హారతులు ఇచ్చారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని ఆలయాల్లో సోమవారం కార్తిక సోమవారం పూజలు నిర్వహించారు. కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం, భైరవపట్నం, శోభనాద్రిపురం విశ్వేశ్వర స్వామి ఆలయం, మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపారు.

కైకలూరులో..

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ ఆలయ ప్రాంగణంలో పార్వతీ సమేత రామలింగేశ్వర, రామేశ్వర, కనక లింగేశ్వర శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గోపూజ, గణపతిపూజ, మహన్యాసం ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి శివాలయంలో భక్తులు కార్తీక పూజలు చేశారు. ఆలయాల ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దళితులు ఐకమత్యంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్: దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అడ్డుకునేందుకు దళితులంతా ఐక్యంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు దళిత నాయకులు అన్నారు. ముదినేపల్లిలో సోమవారం దళితుల ఆత్మీయ సమావేశం జరిగింది. నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు మాట్లాడుతూ పార్టీలకతీతంగా దళితులంతా తమపై జరుగుతున్న దాడులను ఐకమత్యంగా అడ్డుకోవాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ ఎదురుగా తొలగించిన అంబేడ్కర్ విగ్రహం పునర్నిర్మాణం గురించి సమావేశంలో చర్చించారు. సమావేశంలో నాయకులు బేతపూడి వెంకటరమణ, ప్రవీణ్‌బాబు, విజయసాగర్, వరప్రసాద్, కోటేశ్వరరావు, రాంబాబు, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మండవల్లి: కానుకొల్లులో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ నాగదాసి థామస్ సోమవారం ప్రారంభించారు. ఎన్ఆర్‌జీఈఎస్ నిధులు రూ.36 లక్షలతో 505 మీటర్ల రోడ్డు పనులు చేపట్టనున్నారు. కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, బొల్లెంపల్లి కృష్ణారావు, కార్యదర్శి ఎం కొండలు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అపరాల సాగుపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ శాస్త్రవేత్త సుధారాణి

గుడివాడరూరల్: అపరాల సాగుపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఇప్పటి నుంచే అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ శాస్త్రవేత్త సుధారాణి పేర్కొన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రబీ, అపరాల సాగుపై వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందికి గుడివాడ ఏడీఏ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీసాగుతో పాటు అపరాల సాగును చేసే రైతులకు ముందస్తుగా నాణ్యమైన విత్తనాలను ఎన్నుకునేలా సూచనలు చేయాలన్నారు. మేలైన విత్తనాలను ఎన్నుకోవడం ద్వారా గణనీయమైన దిగుబడిని సాధించవచ్చన్నారు. సాగులో పంటలకు వచ్చే చీడ,పీడలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ డీడీఏ జ్యోతిరమణి, డీఆర్‌సీ ఏడీఏ శ్రీనివాస్, గుడివాడ ఏడీఏ రమాదేవి, ఏఓ అనంతలక్ష్మి, డీఆర్‌సీ ఏఓ పద్మజ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎండీ రఫీ

జుఝువరం(పామర్రు): నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఉషోదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ రఫీ తెలిపారు. మండలంలోని జుఝువరం గ్రామంలోని ఉషోదయ హైస్కూల్లో విజేతలన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3వ తేదీన విజయవాడలో 23వ నేషనల్ ఓపెన్ కరాటే చాపియన్ షిప్ పోటీలు చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో అండర్–14 కటా విభాగంలో తమ పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి నోమినా ప్రథమ బహుమతి పొందగా పవన్, డీఈఎస్‌వీ సుధాకర్, ఈశ్వర్ ద్వితీయస్థానం సాధించారని పేర్కొన్నారు. బి ప్రకాష్ పార్థసారథి రాఘవ , శివనాగరాజు తృతీయ స్థానాలను సాధించారని తెలిపారు. విజేతలు, కోచ్ వీవీఎస్ రామకృష్ణను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక లోడింగ్‌లో వివాదం

పమిడిముక్కల: లంకపల్లి రీచ్‌లో అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన కార్మికులు ఎడ్లబళ్లు, ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న ఐనపూరు కార్మికులు సోమవారం రేవులో ఇసుక లోడింగ్ చేసేందుకు వెళ్లారు. తమ గ్రామ పరిధిలోని రేవులో తామే ఇసుక లోడింగ్ చేసుకుంటామని, ఇతరులకు అవకాశం లేదని లంకపల్లి కార్మికులు ఐనపూరు కార్మికులకు అడ్డుకున్నారు. ప్రభుత్వం అందరికీ ఉచిత ఇసుక అవకాశం కల్పించిందని, తమకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఐనపూరు కార్మికులు తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లంకపల్లి కార్మికులు కూడా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. రెండు గ్రామాలకు చెందిన కార్మికులతో తహసీల్దార్ కార్యాలయంలో సీఐ చిట్టిబాబు, ఎస్ఐ శ్రీను, తహసీల్దార్ నవీన్‌కుమార్, టీడీపీ నాయకులు సురేష్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చర్చలు జరిపారు. రెండు గ్రామాల మధ్య రాజీ కుదరకపోవడంతో, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో రెండు గ్రామాల కార్మికులు వెనుదిరిగారు.

బ్యాడ్మింటన్ పోటీలకు కాజ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల విద్యాకుటుంబం

కాజ(మొవ్వ): గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఈ నెల రెండో తేదీన జరిగిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో మొవ్వ మండలం కాజ గ్రామంలోని ఎస్‌పీఎస్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్ఎం రమణి సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు తమ విద్యార్థులు జే చందు, జీ హేమసాయి, సువర్ణ, గీతిక, ప్రసన్న ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ప్రతిభా పాటవాలను పెంపొందించుకోవాలి

జుఝువరం(పామర్రు): విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయుక్తం అవుతాయని ఎంఈఓ జీ పద్మవాణి అన్నారు. మండలంలోని జుఝువరంలోని ఉషోదయ హైస్కూల్లో పోటీ పరీక్షల విజేతలను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల రెండో తేదీన యాక్సిస్ బ్యాంక్ నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో ఉషోదయ విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. విజేతలైన ధోనేష్, భరత్, దీక్షశ్రీ, గ్రేసమ్మ, శరణ్య, ఆకాష్‌కు మెడల్స్, ప్రతిభా సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

■ కొండలమ్మ సేవలో ప్రముఖులు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సోమవారం దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సన్మానించి అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, జనసేన నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

■ పెట్రోల్ బంక్ ప్రారంభం

వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి శ్రీ కార్తికేయ పెట్రోల్ బంక్‌ను సోమవారం ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రారంభించారు. పెట్రోల్ బంక్ యజమానులు పామర్తి రాజా, బాలం జితేంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర బీసీ సంఘ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

■ ప్రకృతి సాగు కూరగాయల విక్రయం

ముదినేపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసి పండించిన కూరగాయల విక్రయ కేంద్రాన్ని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. మండలంలోని కొరగుంటపాలెం, బొమ్మినంపాడు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన కూరగాయలు, ఆకు కూరలను ప్రతివారం జరిగే వారపు సంత సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విక్రయిస్తుంటారు. ఇందులో భాగంగానే ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటుచేసి ఈ విక్రయాలు చేపట్టారు.

■ వృద్ధులకు అన్నసమారాధన

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక బేతవోలు శాంతి వృద్ధుల ఆశ్రమంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ వారణాసి గాయత్రి ప్రసాద్ కుమారుడు మురళీ కృష్ణ ప్రసాద్ వితరణతో ఈ సమారాధన నిర్వహించినట్లు సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ అన్నారు. కార్యక్రమంలో యోగా గురువు కేడీవీఎన్ శ్రీనివాస్, గుడివాడ క్లాత్ మర్చెంట్స్ అసోసియేషన్ కోశాధికారి కొత్త సుబ్బారావు, సయ్యద్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

■ విద్యార్థులకు అవగాహన

కైకలూరు: పాఠశాల స్థాయి విద్యార్థుల పరిచయాలు పరిమితులు దాటకూడదని టౌన్ ఎస్ఐలు డి.వెంకట్‌కుమార్, ఆర్.శ్రీను సూచించారు. ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లైంగిక వేధింపుల నివారణ, పోక్సో చట్టం పనితీరు, సైబర్ నేరాలు, టాబ్‌ల వినియోగం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఎస్ఐలు మాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ఉపాధ్యాయుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ అందిస్తామన్నారు.

■ రేపు కానుకల లెక్కింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు వేసిన కానుకలను దేవదాయ అధికారుల సమక్షంలో బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ శాఖతో పాటు పోలీసు, బ్యాంక్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది నడుమ తమ దేవదాయ సిబ్బంది కానుకలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

■ అర్జీల స్వీకరణ

గుడ్లవల్లేరు: మండలంలోని చినగొన్నూరులో సోమవారం రీ సర్వే సభ నిర్వహించారు. డీటీ రత్నకుమారి మాట్లాడుతూ రీసర్వేలో రైతులు ఇచ్చే అర్జీలను స్వీకరించి ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక


లిఖితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముదినేపల్లి రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని అల్లూరు జెడ్పీహైస్కూల్లో ఆరో తరగతి చదువుతున్న పంతగాని లిఖిత ఎంపికైనట్లు హెచ్ఎం శాంతి రామోజీ సోమవారం తెలిపారు. గుడివాడ ఏపీఎస్ హైస్కూల్లో అండర్–14 బాలికల విభాగంలో జరిగిన ఖోఖో పోటీల్లో లిఖిత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. హెచ్ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ వెంకటశ్యామల, సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థిని లిఖితను అభినందించారు.

బీసీ కాలనీ వద్ద పైప్‌లైన్ లీకేజీ

మండవల్లి: మండవల్లి బీసీ కాలనీ వద్ద మెయిన్ రోడ్డు పక్కన అగ్రహారం నుంచి వచ్చే వాటర్ పైప్‌లైన్ కొన్ని నెలలుగా లీక్ అవుతుండడంతో రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ సోమవారం సాయంత్రం పరిస్థితి సమీక్షించారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను సర్పంచ్ మెండా ఝాన్సీ కోరారు.

• నాగుల చవితికి ఏర్పాట్లు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగులచవితికి ఏర్పాట్లు పూర్తిచేశారు. చవితి పండుగ మంగళవారం కావడంతో పుట్టలో పాలుపోసేందుకు, స్వామి దర్శనార్థం ప్రత్యేక క్యూలను ఏర్పాటుచేశారు. అదనపు ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.